# స్వప్న దృశ్యము

శ్రీమతి పొణకా కనకమ్మగారు

అది స్నిగ్ధోజ్జ్వలమగు మిన్నేట పాల తరగలలో నాణి ముత్యములవలె నక్షత్రముల నారబోయు ప్రశాంతమంజుల చంద్రికాచ్ఛాయలు వెల్లివిరిసియు సమయము.

* * * *

హాయిగా శర్వరీశీతపవన డోలికలలో నూగుచు నిద్రపోవుచున్నారు ఒడలు మఱచి యందఱు వ్రేపల్లెవాడలయందు.

నాకు కొంతసేపు నిద్రపట్టక, అప్పుడే కనుమూసితిని కాబోలును! నా మనస్సు కమ్మతెమ్మెరల ఆనందవీచికలలో స్వప్న వీధుల తారాడుచున్నది.

* * * *

యమునాతీర మనుకొంటాను అది. ఎత్తుగానున్న ఒక సికతాతలమున కూర్చుని, పండువెన్నెలవెల్లువలో రాయంచవగిది మునుకలేయుచున్న చందమామను జూచుచుండగా ఆద్యంతములులేని సృష్టిమర్మము మానసమునకు తట్టినది.

సర్వమత ప్రపంచమునకు పరమలక్ష్యమును, అచింత్యమునునై వెలుగు సన్మయాఖండ అమలజ్యోతిర్మయస్వరూపమునుండి నక్షత్రమువలె ప్రకాశోద్భాసితమై ఒక విస్ఫులింగముగారాలి, అది యొకింతలోనే అనంత భిన్నరూపములను దాల్చినది.

అప్పుడు నేనెవరో స్పృహలేదంతగ. కాని ఒక విమల భావోత్తేజశ్రేణులయందు లగ్నమై నా చూపులు యమునతట్టు తిరిగినవి.

చల్లని సమీరోత్సవములో యమునా తరంగిణీఫేనపంక్తులు గట్లు తన్నుచున్నవి విఱ్ఱవీగుచు. ఆస్రవంతీసంపర్కమున శాద్వలస్థలి ప్రాకృత విరచిత రత్నకంబళమువోలె విరాజిల్లుచున్నది. ఆతటినీతట పరిసరముల తొలిమధురఫలరస వృక్షభరితమును, నవలావణ్యతరుణ నికుంజ మనోజ్ఞవిలసితమును, వికసిత కమనీయ కుసుమసౌరభపూరితమునునై ఒప్పారుచున్నది వనలక్ష్మి కనుల పండువగ. కమ్మని క్రొందేనియ లాస్వాదించి, మత్తుచే పుష్పశయ్యలపై సొమ్మసిల్లినవి భృంగరాజములు. నునుచిగురుటాకులు మెక్కిన కోయిలల మనోహర స్వాదుగానముకూడ వినబడదు యెచట గాని.

అప్పుడు అందెటుచూచినను, ఎదియో నిర్మలతేజ ప్రతిబింబమొండు లలితమోహన దృక్కుల దిశల వెదజల్లుచు, విహారము జేయుచున్నది కలువలేని ధవళమయూఖముల రాశిలో. ఆదృశ్య మనుపమాతీతము.

* * * *

ఒకచో ప్రియజనని యశోదచే తన అమాయికపు దుడుకుచేష్టలకు దండింపబడుచు, మన్ను తినిన అపరాధమును బాపుకొనుటకై జిగిదేరు పాలబుగ్గలపై, అరుణరాగము రేగ నోరుతెరచి, తన బ్రహ్మాండ విశ్వవిభూతినంతయు నుదరమున జూపుచున్నాడు.

ఒకచో కాళియ భోగి దుష్టఫణాగ్రములపై ప్రబలోత్కంఠతో విజృంభించి

లాస్యము సల్పుచు, నతశిరస్కులై పతిభిక్ష నర్థించు వాని సతీమణులను, కరుణార్ద్ర దృగంచలముతో వీక్షించి, అభయప్రదాన మిచ్చుచున్నాడు.

ఒకచో చెట్లబోదెల నానుకొని జాలువారు సెలయేటిదరిని స్వచ్ఛస్ఫురిత శిలావేదికపై నాసీనుడై వేణువు నూదుచున్నాడు శ్రావ్యముగ. ఆ దివ్యమురళీరవామృతము వీనుంసోక, తన్మయతచే గోపకామినులు కామరాగరసోన్మాదినులై నిశ్శబ్ద నిశయందు భౌతికముగా నల్లుకొన్న ప్రగాఢ ప్రేమవల్లరులు త్రెంచుకొని, భగ్నమోహాపుటుత్రాళ్లను ప్రదర్శించుటకు మీ నవనీత శుద్ధాంతఃకరణ మెట్లు అంగీకరించెనోయి మురళీ అని నిస్పృహాజనిత నిష్ఠురోక్తులాడుచుచున్నారు.

ఒకచో పరమభక్తుడైన అక్రూరుడు రథముపైనున్న బలరామకృష్ణులను యమునాగర్భమున దర్శించి, ఆశ్చర్యచకిత మానసుడై ముకుళితహస్తములతో స్తోత్రము చేయుచున్నాడు.

ఒకచో కురుక్షేత్ర సమరావనియందు విరక్త వ్యథాచిత్తుడై నిల్చి, అశ్రుధారాప్లావిత నయనములతో కుందు పాండవమధ్యమునకు, నిష్కామ కర్మయోగసిద్ధాంతమును ఉపదేశించి, ఆహవరంగమునకు పురికొల్పి, ధైర్యోపేతుడై రణస్థలియందు వినీలాభ్రపుష్టమున మెరయు తటిత్తువలె ప్రకాశించు పార్థునకు సారథ్యము చేయుచున్నాడు నొగలపై కూర్చుని.

ఒకచో మహాఋషులందఱు చేతులు మోడ్చి తన ప్రాపంచిక సంబంధము నుపసంహరించుకొని, క్షీరాబ్ధియందు చిరుతరూపియై వటపత్రశయనమున నిర్వికల్పుడై మాయాజన్యమగు భౌతికముగాని, అద్వితీయ నిర్గుణ పరబ్రహ్మమే తానని నిరూపించుచున్న వేదాతీతుని ఉపనిషత్సూత్రములలో బంధించి ప్రార్థించుచున్నారు.

* * * *

నేను ఆపుకొనలేని ప్రమోద పుల్కరములతో సోలి, అటనుండి లేవనుంకింపుచుండ, ఆ సర్వమయుడు తన కంఠసీమ నలరారుచున్న అరవిరిమొగ్గల చంపకహారమును కొనగోటగిల్లుచు, ఉద్యత్ప్రీతిమై వచ్చి తన జిలిబిలి గులాబిరంగు ముద్దుపెదవులపై మందస్మితము నాట్యమాడ నా హస్తము బట్టుకొనబోయెను.

* * * *

ఇంతలో హఠాత్తుగా నల్లని మబ్బుల గుంపు వచ్చి జాబిల్లి నడ్డగించెను. వనీతల మంతయు సాంద్రనీలిమతెర యాచ్ఛాదితమై విభ్రమ మావహించినది. ఏమి చెప్పను! అట నటన సల్పుచున్న జగన్మోహన మూర్తి నీలమేఘశ్యాముడు, ఆకసము నీల నీరదము, యమున నీలనీరపూరితము, పృథ్వి సస్యశ్యామలము. ఈ సన్నివేశమున మలయపవనుడుకూడ శ్యామజడిత వీచికలనే పాఱజల్లుచున్నటుల స్ఫురింప, ఈ యద్భుత పాంచభౌతికపరిణామ చమత్కృతికి అచ్చెరువు నొందుచు, ఇదియే కానోపు సృష్టికి పూర్వమున్న తమోమయ భావాతీతరూపమనుకొనుచుండగా మెలుకువవచ్చినది.